
నమస్తే తెలంగాణ
# కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 14 సెప్టెంబర్ 2024 | KAMAREDDY

- ఉమ్మడి జిల్లాలో నిర్బంధకాండ
- ఎక్కడికక్కడ బీఆర్ఎస్‌నేతల అరెస్టు
- నిరసన తెలిపేందుకూ అవకాశం ఇవ్వని వైనం
- అతిగా వ్యవహరించిన పోలీసులు
- ఖాకీల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు


పెద్దకొడప్గల్‌లో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

# ఇదేం జులుం?

## కాంగ్రెస్ సర్కారు నిరంకుశత్వం


అక్రమ అరెస్టులను నిరసిస్తూ బీబీపేట్ మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


**కాంగ్రెస్ పాలనలో నిరంకుశత్వం రాజ్యమేలుతున్నది.** ఎక్కడికక్కడ నిర్బంధకాండ కొనసాగుతున్నది. పేరేమో ప్రజా పాలన.. తీరేమో నియంతృత్వ పాలన. ఉమ్మడి జిల్లాలో శుక్రవారం జరిగిన అరెస్టుల పర్వమే అందుకు నిలువెత్తు నిదర్శనం. బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా పోలీసులు జులుం ప్రదర్శించారు. అర్ధరాత్రి వేళ ఇండ్లను ముట్టడించి గులాబీ శ్రేణులను అదుపులోకి తీసుకున్నారు. తెల్లారాక కూడా కనిపించిన వారిని కనిపించినట్లు అరెస్టు చేసి ఠాణాలకు తరలించారు. సొంత పనుల మీద బయటికి వెళ్లే వారిని సైతం నిర్బంధించారు. హైదరాబాద్‌కు వెళ్లట్లేదు మొర్రో అన్నా వినకుండా పోలీసుస్టేషన్లకు తీసుకెళ్లి పొద్దంతా కూర్చోబెట్టారు. ప్రభుత్వ ఆదేశాలతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ బీఆర్ఎస్ నేతలపై బల ప్రయోగం చేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్నది.

–నిజామాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

**మాజీ మంత్రులు** తన్నీరు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేల విషయంలో సైబరాబాద్ పోలీసులు ప్రవర్తించిన అనుచిత వైఖరిని ఎండగట్టేందుకు బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధమయ్యాయి. మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్టు చేసి గంటల తరబడి వాహనాల్లో తిప్పిన ఘటనపై గులాబీ నాయకత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ నివాసంలో జరిగే బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి తరలి రావాలని పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి గులాబీ నేతలంతా శుక్రవారం కదిలి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే, ప్రతిపక్ష పార్టీ నేతల గొంతు నొక్కే విధంగా పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. గురువారం అర్ధరాత్రి వేళ మొదలైన అరెస్టుల పర్వం శుక్రవారం పొద్దంతా కొనసాగింది.

### నిబంధనలు గాలికి..

స్వరాష్ట్ర ఉద్యమాన్ని అణిచి వేసేందుకు పోలీసులను అడ్డు పెట్టుకుని నాటి ఆంధ్రా పాలకులు చేసిన క్రూరమైన చర్యల మాదిరిగానే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఉద్యమ జ్వాలను రగిలించి రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీకి కాంగ్రెస్ విధించే నిర్బంధాలు ఏమీ చేయలేవని గులాబీ నేతలు చెబుతున్నారు. కనీస నియమ, నిబంధనలను పాటించకుండా బీఆర్ఎస్ లీడర్లను ఇంటికొచ్చి అరెస్టు చేసి తీసుకెళ్లడంపై వారి కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా దౌర్జన్యంగా ప్రవర్తించడం సరికాదంటూ మండిపడుతున్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేని కాంగ్రెస్.. ప్రతిపక్ష పార్టీలను అణచివేయాలని చూస్తుండడం సిగ్గుచేటంటూ బీఆర్ఎస్ నేతలు విమర్శిస్తున్నారు. తటస్థంగా ఉంటూ ప్రజల రక్షణకు పని చేయాల్సిన పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ మాజీ మంత్రులు వేముల, హరీశ్‌రావులను అరెస్టు చేయడంపై బాల్కొండ నియోజకవర్గ నేతలు ఖండించారు.


భిక్కనూరు పోలీసుస్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు


కామారెడ్డిలో పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు



మద్నూర్ పోలీసుస్టేషన్‌లో..



ఎల్లారెడ్డిలో బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు

---

**గ్రామీణ ఓటరు**

# జాబితా విడుదల

### ఉమ్మడి జిల్లాలో 14.60 లక్షల ఓటర్లు

- పురుషుల కంటే మహిళలే అధికం
- ముసాయిదా జాబితాపై ఫిర్యాదులకు అవకాశం
- 21 వరకు గడువు.. 28న తుది జాబితా


బాన్సువాడ మండలం బోర్లం గ్రామ పంచాయతీలో గ్రామస్తుల సమక్షంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న కార్యదర్శి సాయికుమార్

ఖలీల్‌వాడి/కామారెడ్డి, సెప్టెంబర్ 13 : స్థానిక సంస్థల పోరుకు రంగం సిద్ధమవుతున్నది. ఎన్నికల సన్నాహాల్లో నిమగ్నమైన అధికార యంత్రాంగం.. పంచాయతీల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను శుక్రవారం విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 14.60 లక్షల ఓటర్లు ఉన్నట్లు లెక్క తేల్చింది. రెండు జిల్లాల్లోనూ మహిళలే అత్యధికంగా ఉండడం విశేషం. అన్ని పంచాయతీల్లో జాబితాలను అధికారులు ప్రదర్శనకు ఉంచారు. వాటిపై అభ్యంతరాలకు అవకాశం కల్పించిన అధికారులు.. వాటిని పరిష్కరించి, ఈ నెల 28న తుది జాబితాను విడుదల చేయనున్నారు.

**నిజామాబాద్‌లో 8.29 లక్షలు..**

నిజామాబాద్ జిల్లాలో ముసాయిదా జాబితా ప్రకారం మొత్తం ఓటర్లు 8,29,463 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 3,86,493 మంది కాగా, మహిళలు 4,42,955, ఇతరులు 15 మంది ఉన్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని పంచాయతీల్లోని నోటీసుబోర్డులపై శుక్రవారం ముసాయిదా ఓటరు జాబితాలను ప్రదర్శనకు ఉంచారు.

**కామారెడ్డిలో 6.36 లక్షలు..**

కామారెడ్డి జిల్లాలోని 535 గ్రామాల్లో కలిపి మొత్తం 6.36 లక్షల ఓటర్లు ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. ఈ జిల్లాలోనూ పురుషుల కంటే మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. పురుషులు 3,06,538 మంది ఉండగా, మహిళలు 3,29,747, ఇతరులు 15 మంది ఉన్నారు. ముసాయిదా జాబితాలను అన్ని గ్రామపంచాయతీల్లో ప్రదర్శనకు ఉంచారు. జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 లోపు సంబంధిత పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. మరో వైపు, ఓటరు జాబితాపై ఈ నెల 18న జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం కానుండగా, 19వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో ఎంపీడీవోలు రాజకీయ నేతలతో సమావేశాలు నిర్వహించనున్నారు. ముసాయిదా జాబితాలపై వచ్చిన ఫిర్యాదులను ఈ నెల 26లోగా పరిష్కరించి, 28వ తేదీన ఫొటోతో కూడిన తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు అధికారులు తెలిపారు.

---

# మల్కాపూర్ శివారులో.. మళ్లీ చిరుత సంచారం

- గుర్తించి ఫొటోలు, వీడియో తీసిన రైతు కూలీలు
- నెల రోజుల్లో రెండుసార్లు గొర్రెల మందపై దాడి
- భయాందోళనలో గ్రామస్తులు


గ్రామశివారులో కూలీలకు కనిపించిన చిరుత

సారంగాపూర్, సెప్టెంబర్ 13 : నిజామాబాద్ రూరల్ మండలంలోని మల్కాపూర్(ఏ) గ్రామశివారులో చిరుత సంచారం కొన్ని రోజులుగా కలకలం సృష్టిస్తోంది. నెలరోజుల నుంచి ఇదే ప్రాంతంలో చిరుత సంచరిస్తుండడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలం నుంచి కూలీలతో కలిసి టిప్పర్‌లో శుక్రవారం వేకువజామున వస్తుండగా చిరుత కనిపించింది. గమనించిన కూలీలు తమ సెల్ ఫోన్లలో చిరుత సంచరిస్తున్న దృశ్యాలు చిత్రీకరించి గ్రామానికి చెందిన గ్రూప్‌లో పోస్టు చేశారు. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఆగస్టు 15న ఓ మందపై చిరుత దాడి చేయగా ఒక గొర్రె మృతి చెందింది. మళ్లీ 15 రోజులకు మరోసారి మందపై చిరుత దాడి చేయగా.. రెండు గొర్రెలు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి. ఈ విషయాన్ని గొర్రెల కాపర్లు అటవీ శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. చిరుత దాడిలో ప్రాణం పోతే గాని స్పందించరా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామశివారులో బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

---

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

- కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- కలెక్టరేట్‌లో శ్రమదానం చేసిన కలెక్టర్


శ్రమదానం చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, సెప్టెంబర్ 13 : శ్రమదానంతో పరిసరాలు పచ్చదనంతో కళకళలాడాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో వివిధ శాఖ అధికారులు, సిబ్బంది శ్రమదానం చేశారు. పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. అనంతరం కలెక్టర్ భవన సముదాయంలో కలియతిరుగుతూ గార్డెన్ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యాలయాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. శ్రమదానంలో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ పరిపాలనా అధికారి మసూర్ అహ్మద్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**'టీ-ప్రైడ్' రాయితీ మంజూరు**

టీ-ప్రైడ్ పథకం కింద పెట్టుబడి రాయితీ మంజూరు చేస్తున్నట్లు జిల్లా ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఐ-పాస్ కింద నలుగురు ఎస్సీలకు రూ.13 లక్షల 89 వేల 491, ఎనిమిది మంది ఎస్టీలకు రూ.23 లక్షల 80 వేల 529 పెట్టుబడి రాయితీ మంజూరుకు కమిటీ ఆమోదించినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ లాలూ నాయక్, ఎల్‌డీఎం రవికాంత్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారిణి రజిత, డీపీవో శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

---

## బీఆర్ఎస్ నుంచి నాయకుల సస్పెన్షన్

కామారెడ్డి,సెప్టెంబర్ 13 : కామారెడ్డి పట్టణానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించినందుకు వారి సభ్యత్వాన్ని రద్దు చేస్తూ సస్పెండ్ చేస్తున్నట్లు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ బీజేపీకి బహిరంగంగా మద్దతు తెలిపారని పేర్కొన్నారు. బీజేపీ తరపున ఎన్నికల్లో ప్రచారం చేయడంతో పార్టీ అధిష్టానం సూచన మేరకు నిట్టు వేణుగోపాల్ రావు, నిట్టు కృష్ణ మోహన్ రావు, ముప్పారపు ఆనంద్, ముదాం నవీన్, నిట్టు వెంకట్ రావును పార్టీ ప్రాథమిక సభ్యత్వం తొలగిస్తూ సస్పెండ్ చేసినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

## నేడు ఒంటిపూట బడి

ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 13: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు నేడు (శనివారం) ఒంటి పూట బడులు నిర్వహించాలని నిజామాబాద్ డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ నెల 2న విద్యా సంస్థలకు సెలవు ప్రకటించామని, రెండో శనివారం సెలవును రద్దుచేసి ఒంటి పూట బడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## విషజ్వరంతో యువతి మృతి


శిరీష (ఫైల్)

రెంజల్, సెప్టెంబర్ 13 : మండలంలోని నీలా గ్రామానికి చెందిన ఓ యువతి విషజ్వరంతో మృతి చెందింది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. డిగ్రీ చదువుతున్న శిరీష (25) ఉద్యోగం వెతుక్కోవడానికి ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ వెళ్లింది. అక్కడ తీవ్ర జ్వరం రావడంతో రెండురోజుల క్రితం స్వగ్రామానికి వచ్చి, స్థానికంగా ఓ ఆర్ఎంపీకి చూపించుకున్నది. జ్వరం తగ్గకపోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో వెంకటేశ్ జాదవ్, మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ శుక్రవారం గ్రామానికి చేరుకొని పలు వీధులను పరిశీలించారు.

---

# తాగి బండి నడిపినందుకు తగిన శిక్ష

**ఒకరోజు సామాజిక సేవ చేయాలని కోర్టు ఆదేశం**

వినాయక్‌నగర్, సెప్టెంబర్ 13: మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి నిజామాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అజ్మీరా సాకేత్‌కుమార్ ఒకరోజు సామాజిక సేవ చేయాలని ఆదేశించారు. ఆరోటౌన్ ఎస్సై వెంకటరావు కథనం మేరకు.. ఆరో టౌన్ ఠాణా పరిధిలో గురువారం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో శామీర్‌పేట్ మండలం పొన్నల్ గ్రామానికి చెందిన బత్తిని నవీన్‌కుమార్ మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసిన పోలీసులు.. శుక్రవారం నిజామాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అజ్మీర్ సాకేత్‌కుమార్ ఎదుట హాజరు పరిచారు. నూతన క్రిమినల్ చట్టాలను అనుసరించి నిందితుడు ఒకరోజు సామాజిక సేవ చేయాలని శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించారు. దీంతో నిందితుడు నవీన్‌కుమార్‌ను డిచ్‌పల్లిలోని మానవతాసదన్‌లో సేవ చేసేందుకు పోలీసులు తీసుకెళ్లారు.

---



టీవోవో 954, ఎన్‌వోవో 37 ఉత్తర్వులను రద్దు చేసి ఇటీవల కల్పించిన అడ్‌హక్ ప్రమోషన్లను రూల్ ఆఫ్ రిజర్వేషన్ రూల్ ప్రకారం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల ఐకాస పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ కార్యాలయం ఎదుట భోజన విరామ సమయంలో ఉద్యోగులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. –ఖలీల్‌వాడి, సెప్టెంబర్ 13

**బీడీ కార్మికులకు జీవనభృతి** రూ.4,016 అమలు చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జక్రాన్‌పల్లి, ఏర్గట్ల మండల కేంద్రాల్లో శుక్రవారం బీడీ కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో, తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టినట్లు బీడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ముత్తెన్న తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నజీర్, శ్రీనివాస్, గంగాధర్, సత్తెక్క, సార సురేశ్, నాయకులు రాజేశ్వర్, కిషన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

–జక్రాన్‌పల్లి/ఏర్గట్ల, సెప్టెంబర్ 13



జక్రాన్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న బీడీ కార్మికులు